అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు



నవ భారత నిర్మాత బీఆర్ అంబేద్కర్

● జోహార్లు అర్పించిన కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 14: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని, ఆయన యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని కలెక్టర్ విజయరామరాజు అభివర్ణించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ విజయరామరాజుతో పాటు జేసీ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో అంబేద్కర్ పోషించిన పాత్ర విశేషమైందన్నారు. రాజ్యాంగాన్ని రచించిన ఆయన అపర మేధావి, విద్యావంతుడని కొనియాడారు. అంబేద్కర్ త్యాగానికి, కృషికి, మొండి పట్టుదలకు, నిజాయితీ, నిబద్ధతకు, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. ఆయన మేధా నిరతికి రెండు చేతులు జోడించి హృదయ పూర్వక అభినందనల తెలుపు కుంటున్నామన్నారు. ప్రతి పౌరుడు దేశం పట్ల వారి బాధ్యతలను ఎన్నడూ మరువరాదన్నారు. ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నాయంటే అంబేద్కర్ రాజ్యాంగ రచన, నైపుణ్యం ఎంతటిదో అర్థమౌతోందన్నారు.

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో

కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన అంబేడ్కర్ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి జేసీ గణేశ్‌కుమార్‌తో పాటు డీఆర్వో, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, మైనార్టీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వీరన్న, వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ గణేశ్‌కుమార్ మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర విశేషమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

● ఎస్పీ సిద్దార్థ కౌశల్


కడప (క్రైం), ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలు కొనియాడారు. అంబేద్కర్ ఆలోచనలు రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమని, దేశంలో అన్ని వర్గాల ప్రజలకు చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) లోసారి సుధాకర్, ఏఆర్‌అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, టైటాస్, వీరేష్, ఆర్ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

పొరుగు మద్యం సిద్ధం

● ఎన్నికల వేళ లిక్కర్‌కు డిమాండ్
● జగన్ సర్కారు మందు పట్ల మద్యంప్రియుల విముఖత
● ప్రచారంలో లిక్కర్‌దే ప్రధానం
● కర్ణాటక, గోవా, హర్యాన, తెలంగాణ నుంచి దిగుమతి
● ఇప్పటికే కొందరు వైసీపీ నేతల వద్ద కావాల్సిన మద్యం సిద్ధం
● రహస్య ప్రాంతాల్లో డంపింగ్
● 18 నుంచి నామినేషన్లు
● జోరందుకున్న ప్రచారం



(కడప - ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఎన్నికలంటే మద్యం, బిర్యానీ, డబ్బు. నువ్వు ఎంత మంచి పనిచేసినా, ఏం సేవ చేసినా కూడా ఆ ప్రభావం లోకల్ బాడీ ఎలక్షన్‌లో ఎక్కువ ఉంటుంది. మరి సార్వత్రిక ఎన్నికలంటే.. అందునా ఈసారి టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. ఇరుపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఓ విధంగా చెప్పాలంటే ఇరువురికి ఇది డూ ఆర్ డైగా మారాయి. అందుకే ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎన్నికలు ఎంత ప్రతిష్టాత్మకమో డబ్బు, మద్యం కూడా ఏరులై పారనుంది. సాధారణంగా ఓటర్లకు పోలింగ్‌కు రెండురోజుల ముందు ఓటుకు నోటు ఇస్తుంటారు. అయితే మద్యం మాత్రం డైలీ పంపిణీ చేయాల్సిందే. అటు ప్రచారం మొదలుకుని బహిరంగసభలు ఇలా ఒకటేంటి అన్నింటికీ మద్యమే కీ రోల్ పోషిస్తుంది. అందుకే ఎన్నికలంటే మద్యానికి డిమాండ్ వస్తుంది. మరి సార్వత్రిక ఎన్నికలంటే మామూలుగా ఉండదు. అందులోనూ సీఎం జిల్లా కడపలో ఎన్నికలు కావడంతో ఇక్కడ లిక్కర్‌కు బాగా డిమాండ్ ఏర్పడింది. కొందరు వైసీపీ నేతలు ముందు చూపుతో అవసరమైన మద్యాన్ని తెప్పించుకుని సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇక ఇటు జగన్ సర్కారు అమ్మే మందును తాగేందుకు మందుబాబులు ఇష్టపడడం లేదు. ఎప్పుడూ లేనంత బ్రాండ్లు జగన్ అండ్ కో అమ్ముతుంది. అయితే ఎన్నికల వేళ ఈ మందు ఇస్తే దెబ్బతింటామని భావించిన వైసీపీ నేతలు పొరుగు మద్యాన్ని తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. ఇది వరలో తెలంగాణ నుంచి ప్రొద్దుటూరుకు మందు తీసుకువస్తుండగా కర్నూలులో మందు పట్టుబడింది. అదంతా తెలంగాణ నుంచి ప్రొద్దుటూరుకు తరలిస్తున్నట్లు అర్థమైంది.

జోరుగా పొరుగు మద్యం

ఎన్నికల నోటిఫికేషన్ గత నెల 16న వెలువడింది. అప్పటి నుంచి టీడీపీ, వైసీపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 18న షెడ్యూలు వెలువడనుంది. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. అప్పటి నుంచి ప్రచారం హోరెత్తనుంది. వచ్చే నెల 13న పోలింగ్ ఉంటుంది. ఇప్పటికే ఆత్మీయ సమావేశాలు, డోర్ టు డోర్ ప్రచారాలు, బహిరంగసభలతో జనం చుట్టూ తిరుగుతున్నారు. ఓటరు నాడి ఎలా ఉన్నా ప్రచారానికి వెళ్లాలంటే మందీ మార్బలం అవసరం. ఒకప్పుడు స్వచ్ఛందంగా జనాలు వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. డబ్బు, మందు, బిర్యానీ పెడితే తప్ప రాని పరిస్థితి ఉంది. ఇక మందుబాబులు కోరుకునే మద్యం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో లేదు. రకరకాల బ్రాండ్లు ఉన్నాయి. మందుబాబులకు అవసరమైన మందు కావాలంటే బార్లకు వెళ్లాల్సిందే. అక్కడ మద్యం రేట్లు ఎక్కువగా ఉంటాయి. బార్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉండవు. అందుకే పొరుగు మద్యాన్ని నమ్ముకున్నారు. సౌత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో మన పోలింగ్ రోజున పార్లమెంటు ఎన్నికలు మాత్రమే జరగనున్నాయి. కర్ణాటక, తమిళనాడులో అదే పరిస్థితి.

కర్ణాటక, హర్యానా, గోవా టు కడప

ఎన్నికల వేళ మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించింది. అంటే గత ఏడాది ఏప్రిల్, మే ఎన్నికలు జరిగే లోపు ఎంత అయితే మద్యం అమ్మకాలు జరిగాయో వాటికంటే కేవలం 30 శాతం అదనంగా మాత్రమే విక్రయాలు జరగాల్సి ఉంది. ఉదాహరణకు గతేడాది ఏప్రిల్‌లో వంద కోట్ల మద్యం అమ్మకాలు జరిగి ఉంటే.. ఈ ఏడాది రూ.130 కోట్లు మాత్రమే జరగాల్సి ఉంది. జిల్లాలో 124 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 29 బార్లు ఉన్నాయి. జిల్లాలో మద్యం షాపులకు అవసరమైన మద్యం కడప, ప్రొద్దుటూరు గోడౌన్ నుంచి సరఫరా అవుతుంది. ఒకప్పుడు ప్రచారాల్లో పాల్గొనేవారు, తాగేటోళ్లు మాత్రమే మద్యం తీసుకునేవారు. అయితే ఈసారి ప్రచారానికి వచ్చే ప్రతిఒక్కరూ మద్యం తీసుకుంటున్నారు. మగాళ్లు మాత్రమే కాదు.. ఆడ వారు కూడా మందు కావాలని డి మాండ్ చేస్తున్నారు. ఇక ప్రభుత్వ మద్యంషాపుల్లో దొరికే చీప్ మ ద్యం ఇస్తే ప్రచారానికి వచ్చే వాళ్లు తీసుకోవడం లేదని చె బుతారు. ఇదే మద్యాన్ని ప్ర చారానికి వచ్చిన వారికి, సభలకు వచ్చే వారికి ఇస్తే కొంపముంచుతారని భావించి పొ రుగు రాష్ట్రాల నుంచి తెస్తున్నట్లు సమాచారం. ఇప్పుడంతా ప్రభుత్వమే మద్యం అమ్ముతుంది. కొన్ని షాపుల్లో వైసీపీ నేతలకు అవసరమైన మద్యాన్ని కొనుగోలు చేసి వైసీపీ నేతలు నిల్వ పెట్టుకుంటున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి మందుబాబులు తాగే అన్ని బ్రాండ్లు లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుంచి తెస్తున్నారు.

విచ్చలవిడిగా

కర్ణాటక, గోవా, హర్యానా మద్యం.. సీఎం సొంతూరు పులివెందులలో విచ్చలవిడిగా దొరుకుతున్నట్లు చెబుతున్నారు. హర్యానా ఇతర రాష్ట్రాల నుంచి ఫ్రూట్స్ మాటున దిగుమతి అవుతుండగా కర్ణాటక, తెలంగాణ నుంచి వివిధ మార్గాల్లో తీసుకువస్తున్నట్లు అంటున్నారు. ఈసారి ఎన్నికలు జిల్లాలో మామూలుగా ఉండవు. షర్మిలా కడప పార్లమెంటుకు పోటీ చేయడం, పులివెందులలో కూడా అభ్యర్థులను నిలబెడుతుండడంతో వైసీపీని టెన్షన్‌కు గురి చేస్తుంది. అందుకే విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని హర్యానా, కర్ణాటక, గోవా నుంచి భారీగా మద్యం రవాణా అవుతున్నట్లు చెబుతున్నారు. పులివెందుల నుంచి కర్ణాటక బార్డర్ 93 కి.మీ ఉంది. ఎలాగోలా అక్కడ నుంచి అడ్డమార్గాల్లో లిక్కర్ తెస్తున్నట్లు చెబుతున్నారు. ఇక ప్రొద్దుటూరులో కూడా పెద్దఎత్తున లిక్కర్ దిగుమతి అవుతోంది. జిల్లాలో కడప, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల ఇలా అన్ని చోట్ల పొరుగు మద్యం సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. కొందరు వైసీపీ నేతలు ఇప్పటికే ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, కడప, కమలాపురంకు చెందిన వైసీపీ నేతలు కావాల్సినంత మద్యాన్ని దిగుమతి చేసుకున్నట్లు చెబుతున్నారు.

హమ్మయ్య బతికించారు

● విద్యుత్ వేళల్లో మార్పులు

పులివెందుల, ఏప్రిల్ 14: హమ్మయ్య.. విద్యుత్ రైతుకు అనుకూల సమయంలో సరఫరా చేస్తున్నారు.. బతికిపోయామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 8వ తేది రైతులంటే చిన్నచూపా' అనే కథనం వెలువడింది. ఇందుకు విద్యుత్ శాఖ స్పందించి విద్యుత్ వేళల్లో మార్పులు చేశారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందిస్తున్నారు. కానీ గత చలికాలంలో తెల్లవారుజామున 4 లేదా 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట లేదా 2 వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తూ వచ్చారు. కానీ వేసవి వచ్చే సరికి ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎర్రని ఎండలో విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పంటలకు నీరందించాలంటే పూర్తిగా రోజంతా ఎర్రని ఎండలో ఉండాల్సిందే. దీంతో పంటలు ఎలా సాగుచేయాలో అంతుబట్టడం లేదని రైతులు మదనపడ్డారు. కాగా శనివారం నుంచి విద్యుత్ వేళల్లో మార్పులు చేసింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించి వేళల్లో మార్పు చేసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హమ్మయ్య ఎండ వేడికి కాస్త అయినా ఉపశమనం ఉంటుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా దుర్గాప్రసాద్



కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా సుధా దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పొన్నోలు రాంప్రసాద్‌రెడ్డిని కూడా రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

దాశరథి.. అభివృద్ధి జాడేది..?

● రూ.100 కోట్ల అభివృద్ధి ప్రణాళికపై శీతకన్ను
● టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి
● జగన్ ప్రభుత్వంలో ఒక్క పనీ చేయలేదు
● ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం
● కలగా మారిన ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి
● 50 శాతం మాత్రమే పూర్తయిన కల్యాణ మండపం



నాడు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో ఒంటిమిట్ట చెరువు కళకళ



నేడు నిర్వహణ ఖర్చులు లేక పథకం ఎత్తిపోయి చుక్కనీరు లేక చెరువు వెలవెల

రాజంపేట, ఏప్రిల్ 14 : ఆంధ్రా భద్రాద్రిగా ఒంటిమిట్ట కోదండ రామాలయ అభివృద్ధి పనులకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా ఆ పనుల్లో 50 శాతం పూర్తయినా మిగిలిన పనులు పూర్తి చేయడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బ్రహ్మోత్సవాల నిర్వహణ తప్ప ఈ ఆలయ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. జగన్ ప్రభుత్వంలో రెండేళ్ల కరోనా వల్ల నామమాత్రంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలు తప్ప ఈ ఆలయంపై జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి జగన్ ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. తెలంగాణా విడిపోయిన తరువాత భద్రాచలం రీతిలో ఎంతో ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉన్న కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించారు. ప్రకటించిన తరువాత ఒక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వమే కల్యాణోత్సవ ఏర్పాట్లు చేసింది. అనంతరం ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పజెప్పారు. ఆ సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి 100 కోట్ల రూపాయల నిధులను ఆలయ అభివృద్ధికి కేటాయించి భద్రాచలం కంటే ఉన్నత స్థాయిలో ఈ కోదండరామాలయాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఆ సమయంలో నిత్యం కరవుతో ఇబ్బందులు పడుతూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న ఒంటిమిట్ట ప్రాంతంలో అటు భూగర్భజలాలు, ఇటు సాగు జలాలు ఏర్పాటు చేయడానికి కోదండరామాలయాన్ని ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువును ఎప్పుడూ నీటితో నింపి హైదరాబాదు ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేసి టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే సోమశిల వెనుక జలాల నుంచి కేవలం ఆరు నెలల వ్యవధిలో సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకపు ట్యాంకులను, మోటార్లను ఏర్పాటు చేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ఒంటిమిట్ట చెరువుకు తెలుగుదేశం ప్రభుత్వం నీరందించింది. సుమారు 50 కోట్లతో ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సుమారు లక్ష మంది వీక్షించే విధంగా కల్యాణ మండపం ఏర్పాటు, మాడవీధుల ఆధునీకరణ, ఉద్యానవనాల ఏర్పాటు, ప్రత్యేక క్యూలైన్ల నిర్మాణం, అన్న ప్రసాద సత్రం, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు.

ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం

ఒంటిమిట్ట కోదండరామాలయం ఆనుకొని ఉన్న ఒంటిమిట్ట చెరువుకు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువును శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం 33.44 కోట్లతో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి నీరందిస్తే ఆ పథకం నిర్వహణలో కూడా జగన్ ప్రభుత్వం విఫలమైంది. ఈ పథకం నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సిన సంబంధిత శాఖ చేతులెత్తేసింది. నిర్వహణ బాధ్యత అనగా కరెంటు బిల్లులు కట్టడం, మోటార్లను రిపేర్లు చేయించుకుంటూ ఉండటం, వాటి రిపేర్ల ఖర్చు, అక్కడ సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాల్సి ఉంది. అయితే ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నిర్వహణ బాధ్యతలను చెరువు ఆయకట్టు రైతులే భరించాల్సి ఉందని పేర్కొంటూ ఇది తమ బాధ్యత కాదని, చెరువుకు నీరందించడం మానేశారు. కారణం కరెంటు చార్జీలు కట్టలేక, నిర్వహణ ఖర్చులు భరించలేక ఆయకట్టు రైతులపై ఈ నెపం తోసేశారు. ప్రస్తుతం సోమశిల బ్యాక్‌వాటర్ పూర్తిగా అడుగంటింది. దానికి తగ్గట్టు ఎత్తిపోతల పథకం పైపులైన్లు లేకపోవడంతో ప్రస్తుతం చెరువుకు నీరందించలేని పరిస్థితి ఏర్పడింది. అంటే ఒక చెరువుకు కేవలం కోదండరాముని ఆలయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంత పెద్ద భారీ మొత్తంలో నిధులు కేటాయించి టీటీడీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తే దాని పరిపాలనా బాధ్యతలు చూసుకోలేని నేటి ప్రభుత్వం, ప్రభుత్వ నిర్వాహకం వల్ల ఎత్తిపోతల పథకం ఎత్తిపోయి చెరువులో చుక్క నీరు లేక నేడు బ్రహ్మోత్సవాల వేళ వెలవెలబోతూ ఇప్పటి ప్రభుత్వ పనితీరును కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. దీనివల్ల ఆయకట్టు రైతులకు నీరందకపోగా భూగర్భజలాలు అడుగంటి తాగునీరు లభించకపోగా చెరువు కట్ట సుందరీకరణ ఏమాత్రం ముందుకు సాగక ట్యాంక్ బండ్ రీతిలో అభివృద్ధి అటకెక్కిపోయింది.

సగమే పూర్తయిన కల్యాణ మండపం

ప్రధానంగా కోదండరాముని కల్యాణ మండపం సగమే పూర్తయింది. రాత్రివేళ పండు వెన్నెల పున్నమి రాత్రిలో జరిగే ఈ కల్యాణోత్సవానికి లక్షల మంది భక్తులు వస్తారు. ఆ భక్తులకు తగ్గట్టు కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కల్యాణ మండపం సగభాగం పూర్తయిందే తప్ప మిగిలిన అర్ధభాగం పూర్తి చేయలేదు. దీనిపై టీటీడీ ఏమాత్రం దృష్టి పెట్టలేదు. ఆలయానికి సమీపంలో చెరువు కట్టపై అంజనేయుడి విగ్రహం, జాంబవంతుడి విగ్రహాలు, శ్రీరాముడి విగ్రహాలు, స్వాగత తోరణాలు, మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి కూడా ఏర్పాటు చేయలేదు. కోదండరాముడి జన్మస్థలి ఒంటిమిట్టను తిరుమల రీతిలో అన్ని రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మిక శోభను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు తగ్గ ట్టు ఏ పనీ చేయలేదు. ఒంటిమిట్ట ఆలయ భక్తుల కోసం ఏ ర్పాటు చేస్తామన్న ధ్యానమందిరం జాడే లేదు. కడప, రాజంపేట నుంచి ఆలయానికి వచ్చే ప్రధాన మార్గంలో రాత్రివేళ కనువిందు కలిగించే రీతిలో దేదీప్యమానంగా వెలిగే లైట్లను ఏర్పాటు చేయలేదు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో కోదండరాముడి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు. టూరిజం హబ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనులు ఏ ఒక్కటీ జరగలేదు. బ్రహ్మోత్సవాల వేళ టీటీడీ సిబ్బంది అంతా ఒంటిమిట్టకు చేరుకుని ఆర్భాటంగా పనులు చేస్తారు తప్ప అనంతరం మచ్చుకైనా ఆవైపు ఏడాది పొడవునా కనిపించరు. 100 కోట్ల మాస్టర్ ప్లాన్ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. జిల్లాకు సంబంధించిన నేత ముఖ్యమంత్రి అయినప్పుడు అదే జిల్లాలోని రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక సంపదగా గుర్తింపబడ్డ కోదండరాముడి ఆలయ అభివృద్ధికి ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. తెలంగాణాలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరి గుట్టను దేశంలోనే ఓ ఉన్నత ఆలయంగా వంద కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసి తిరుగులేని రీతిలో అభివృద్ధి చేశారు. అయితే జిల్లావాసి ముఖ్యమంత్రి అయినా రాష్ట్ర ఆధ్యాత్మిక సంపద కేంద్రంగా ఉన్న ఒంటిమిట్టను అభివృద్ధి చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై వివరణ కోసం టీటీడీ అధికారులను సంప్రదించగా వారు ఎవ్వరూ అందుబాటులో లేరు..



సగమే పూర్తయిన కోదండరాముడి కళ్యాణ వేదిక..





నిర్వహణకు కూడా నోచుకోక అలంకారప్రాయంగా మారిన శ్రీరామ ఎత్తిపోతల పథకం


జగన్ ప్రభుత్వానికి భక్తుల మనోభావాలు పట్టవు



జగన్ ప్రభుత్వానికి అధికారంలో ఉన్న ఈ ఐదేళ్ల తన సొంత జిల్లాలో ఉన్న భక్తుల మనోభావాలు పట్టలేదు. జిల్లాలో ఇంత విశిష్టమైన ఆలయం ఉందని, దానిని అభివృద్ధి చేయాలని ఏనాడూ ఆయన ధ్యాస లేదు. తన అతిథి గృహం ఉన్న ఎనుములు, ఎద్దులు తిరిగే అటవీ ప్రాంతమైన ఇడుపులపాయకు నాలుగు లేన్ల రోడ్డు వేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ ఈ ఆలయంపై ఒక శాతం కూడా లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టితో ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి వంద కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆదేశాలు ఇచ్చినా వాటిని పూర్తి చేయాల్సి ఉండగా ఆ ఆలోచనే లేదు. సరికదా ఈ ఐదేళ్లలో ఒక్క పైసా నిధులను కూడా ఈ ఆలయ అభివృద్ధికి కేటాయించలేదు. అందువల్లే ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం ఎత్తిపోయి అటు రైతులకు సాగునీరు రాక, ఇటు ప్రజలకు తాగునీరు అందక చెరువులో చుక్కనీరు లేక పర్యాటక శోభ కూడా కనుమరుగైంది. దీనిని కోదండరాముని భక్తులు ఎప్పటికీ క్షమించరు.

- బొబ్బిలి రాయుడు, భక్తుడు, ఒంటిమిట్ట

భక్తులకనుగుణంగా అభివృద్ధి చేయాలి



తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణలో కోదండరామాలయం ఉంది. ఇది రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక సంపద. ఈ ఆలయాన్ని భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ ఆలయం అటు ఆధ్యాత్మికంగానూ, చారిత్రకంగానూ, పర్యాటకపరంగానూ ఎంతో ప్రాశస్త్యమైన ప్రాంతం. తెలంగాణా, ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు దేశంలోని ఇతర ప్రాంతాల భక్తులు నిత్యం ఈ ఆలయానికి వస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టుగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయమని భక్తుల తరఫున కోరుతున్నాం.

- కొమరా వెంకటనరసయ్య, కోదండరాముడి భక్తుడు, ఒంటిమిట్ట

24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలి

- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల విధుల శిక్షణకు గైర్హాజరైన పీఓలు, ఏపీఓలు 24 గంటల్లోగా సంజాయిషీలు సమర్పించాలని, లేనిపక్షంలో తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన పీఓలు, ఏపీఓల శిక్షణకు 2550 మంది హాజరు కావాల్సి ఉండగా, 41 మంది గైర్హాజరవడంతో జిల్లా ఎన్నికల అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై క్రమశిక్షణారాహిత్య చర్యల కింద షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. 24 గంటల్లోపు తగు సంజాయిషీ ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో ఆదేశించారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

కడప రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధు సూదన్



పీఓ, ఏపీఓల శిక్షణలో సూచనలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 14: ఎన్నికల ప్రకియలో పోలింగ్ కేంద్రాల్లో కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ప్రిసైడింగ్, సహాయఅధికారులకు కడప నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధుసూదన్ సూచించారు. ఆదివారం గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల విధులకు నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కడప రిటర్నింగ్ అధికారి మధు సూదన్ అధ్యక్షతన రెండో రోజు శిక్షణ జరిగింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను సజావుగా నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా జరిపేందుకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. శిక్షణలో పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం మాస్టరు ట్రైనర్లు డెమో, బ్యాలెట్ బ్యాక్సులు, వీవీ ప్యాడ్స్ చూపిస్తూ నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలపై పవర్ పాయిట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఘనంగా ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్14: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవా లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ప్రాంభిం చారు. అగ్నిప్రమాదాల నివారణ చర్య లు గురించి తెలిపే కరపత్రాలను, పోస్టర్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజ లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కలెక్టర్ వివరించారు.

బ్రిడ్జిని ఢీకొన్న కారు - ఒకరి మృతి

ఖాజీపేట, ఏప్రిల్ 14: కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఆంజనేయపురం వద్ద బ్రిడ్జిని కారు ఢీకొనడంతో మేడా రవీంద్ర (57) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు కడప వాసులు ఆంజనేయులు, శ్రీనివాసులు పని నిమిత్తం ప్రొద్దుటూరు సమీపంలోని పల్లవోలుకు వెళ్లి అక్కడి నుంచి ప్రొద్దుటూరులోని రవీంద్రను కలిసి తిరిగి సాయంత్రం కడపకు వస్తుండగా చెన్నూరు బ్రిడ్జిని ఢీకొన్నారు.ఇందులో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రవీంద్ర మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు.

భర్త, అత్త,మామ అరెస్టు

కడప(క్రైం), ఏప్రిల్ 14: కడప నగరం మృత్యుంజయకుంటలో వివాహిత ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మృత్యుంజయకుంట వాసి కుళాయమ్మ అనంతపురం వాసి కుళాయప్పతో ఏడాది కిందట వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసులో భర్త కుళాయప్ప అతని తండ్రి కుళాయప్ప, తల్లి కుళాయమ్మను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

రూ.3లక్షలు నగదు పట్టివేత

పెనగలూరు, ఏప్రిల్14: ఎన్నికల నియమావళిలో భాగంగా ప్రత్యేక పోలీసు బలగాలు ఆదివారం సాయంత్రం నారాయణ నెల్లూరు వద్ద ఓ కారులో తరలిస్తున్న మూడు లక్షల రూపాయలు నగదును పట్టుకుని ట్రెజరీలో అప్పజెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై పెనగలూరు ఎస్ఐ సుభాష్, చంద్ర బోస్‌ను వివరణ కోరగా ఎలక్షన్ స్క్వాడ్, రెవెన్యూ బృందాలు నారాయణ నెల్లూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో రూ.3లక్షల నగదు, విద్యుత్ గృహోప కరణాలు దొరికినట్లు తెలిపారు.



కోదండరాముని బ్రహ్మోత్సవాలు చూతము రారండి

● సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న ఆలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 14: శ్రీరామచంద్రుని, సీతమ్మ తల్లి పెళ్లి కనులారా చూతము రారండి అంటూ ఒంటిమిట్ట కోదండరామాలయం భక్త జనకోటికి స్వాగతం పలుకుతోంది. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కోదండరామాలయంలో పూర్తి స్థాయిలో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. గతానికి భిన్నంగా టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లను చేపట్టారు. ఆలయ రాజగోపురం, ముఖద్వారం, దక్షిణ, ఉత్తర గోపురాలు, రామాలయ ప్రాంగణం ప్రత్యేక ప్రణాళికతో చేపట్టారు. భక్తుల కోసం రంగ మండపం, రామాలయ ప్రాంగణలో జర్మన్ టెక్నాలజీతో జర్మన్ షెడ్డును ఏర్పాటు చేశారు.

భక్తుల కోసం అన్నదానం

కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామాలయానికి విచ్చేస్తున్న భక్తులకు రామాలయం ఎదురుగా టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్నదానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లను చేపట్టింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన ఏర్పాట్లను టీటీడీ చేపట్టనుంది. వీటి కోసం తిరుమల నుంచి ప్రత్యేక వంట మాస్టర్లను, వంట సామగ్రిని, కావాల్సిన బియ్యం, కూరగాయలు తీసుకొచ్చేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే ఏర్పాట్లను టీటీడీ ప్రత్యేకంగా చేపట్టింది.

కల్యాణ వేదిక వద్ద ముమ్మర ఏర్పాట్లు

కోదండరాముని కల్యాణ వేదిక వద్ద టీటీడీ ప్రత్యేక అభివృద్ధి పనులను చేపట్టారు. గతేడాది కల్యాణంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులతో చర్చించి భక్తుల కోసం అభివృద్ధి పనులు టీటీడీ చేపడుతోంది. ప్రత్యేకంగా మహిళలకు, పురుషులకు శాశ్వత మరుగుదొడ్లను, కల్యాణం రోజున ప్రసాదం పంపిణీ కోసం ప్రత్యేక వంట శాలను, బ్రహ్మోత్స వాల రోజున పనిచేస్తున్న సిబ్బంది కోసం అన్నదానం ఏర్పాట్లు చేపడతారు. అండర్‌గ్రౌండ్ విద్యుద్దీపాలంకరణ, తాగునీటి కోసం సంప్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఓవర్‌ఫ్లో ట్యాంక్ నిర్మించారు. కల్యాణ వేదిక అభివృద్ధిలో భాగంగా నరవకాటిపల్లె రహదారి కల్యాణ మండపంలోకి రావడంతో వారి కోసం రైల్వేస్టేషన్ మీదుగా కొత్తగా రోడ్డును ఏర్పాటు చేశారు. వీటితో పాటు కల్యాణ తంతులో ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లును టీటీడీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.



క్లాప్ ఫ్లాప్



తిరగని క్లాప్ ఆటోలు
నిలిచిపోయిన ఇంటింటి చెత్త సేకరణ
నిర్వహణపై చేతులెత్తేసిన ప్రభుత్వం
వీధి వీధినా దర్శనమిస్తున్న చెత్త దిబ్బలు
మందకొడిగా చెత్త పన్ను వసూళ్లు
శానిటేషన్ అధికారుల వైఫల్యం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 14: ఇంటింటా చెత్త సేక రణ కార్యక్రమం ఆర్భాటంగా చేపట్టినా అమలు మాత్రం విఫలమైందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) అమలులో మాత్రం చతికల పడిందని చెప్పవచ్చు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు మున్సిపాలిటీల్లో ఇంటింటి నుంచి చెత్తసేకరణ కోసం వాహనాలను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యత ప్రైవేటు ఏజన్సీలకు అప్పగించింది. కానీ అనుకున్నంత స్థాయిలో చెత్త పన్ను వసూలు కావడంలేదు. దీంతో క్లాప్ వాహనాల ఏజన్సీకి మున్సిపాలిటీలు అద్దెలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా క్లాప్ వాహనాల మెయింటెనెన్స్, మరమ్మత్తులకు, సిబ్బందికి జీతాలు చెల్లించడం భారమైంది. మున్సిపల్ శానిటేషన్ అధికారుల వైఫల్యంతో సకాలంలో చెత్త తరలింపు పనులు చేపట్టలేక పోవడంతో వీధి వీధిన చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. వివరనాల్లోకెళితే...

జిల్లాలో కడప ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో 2022 మార్చి1 నుంచి క్లాప్ వాహనాలు ప్రారంభించి ఇంటింటా చెత్తసేకరణ పనులు ప్రారంభించారు. కడపలో 100 వాహనాలు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 40 వాహనాలు అవసరం వుండగా 35 వాహనాలు అందుబాటులో వుంచారు. కడపలో 100 వాహనాలకు నెలకు రూ. 56,81,678 ప్రొద్దుటూరులో 35 వాహనాలకు నెలకు రూ. 24,35,004 మున్సిపాలిటీ ఏజెన్సీకి చెల్లిస్తోంది. ఈ ప్రకారం ఒక్కో వాహనానికి నెలకు రూ.64 వేల అద్దె చెల్లిస్తున్నారు. ఈ అద్దె మున్సిపాలిటీల్లో యూజర్ చార్జీల పేర చెత్తపన్ను వసూలు చేసి చెల్లించాల్సివుంది. అయితే ప్రజల్లో చెత్త పన్ను పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుండడంతో అనుకున్నంత స్థాయిలో వసూళ్లు కావడంలేదు. ప్రత్యేకంగా వార్డుకు ఒక సచివాలయ శానిటరీ సెక్రటరీ వున్నా యూజర్ చార్జీల వసూళ్లలో వెనకబడ్డారు. దీంతో ఏజెన్సీలకు సకాలంలో మున్సిపాలిటీలు అద్దె చెల్లించకపోవడంతో ఏజెన్సీలు డ్రైవర్లకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఏజన్సీలు క్లాప్ వాహనాల డ్రైవర్లకు సూపర్ వైజర్లకు జీతాలు చెల్లించలేక మరమ్మత్తులు సైతం చేపట్టలేక ఆటోలు నిలిచిపోయాయి. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ సిబ్బంది విధులు నిర్వహించబోమని ఫిబ్రవరి నుంచి ఆటోలు తిప్పడం బంద్ చేశారు. దీంతో కసువు సేకరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కడప ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో క్లాప్ ఆటోలు కొన్నింటిని తిప్పుతూ డ్రైవర్లకు జీతాలు ఇచ్చేలా డీజల్ ఖర్చు భరించేలా అధికారులు చర్యలు తీసు కుంటున్నారు.

చేతులెత్తేసిన ఏజన్సీ

మున్సిపాలిటీలు అద్దె సకాలంలో చెల్లించలేకపోవడంతో ప్రొద్దుటూరులో క్లాప్ వాహనాల సేవలను రెడ్డి ఏజన్సీ బంద్ చేసి చేతులెత్తేసింది. దీంతో వాహనాలన్నీ మున్సి పాలిటీలో ఎక్కడికక్కడ నిలిపివేశారు. చాలా రో జులుగా మూలన పడడంతో టైర్లు పాడైపోయాయి. వాహనాల పైన వుండే చెత్త డోర్లు తీసుకెళ్లారు. మరికొన్ని తుప్పు పట్టే పరిస్థితి ఏర్పడింది.

మున్సిపాలిటీలకు భారం....

36 క్లాప్ వాహనాల్లో 18 వరకు పూర్తిగా బాగా దెబ్బతిన్నాయి. కేవలం 18 ఆటోలు మాత్రమే కొంత మరమ్మత్తులు చేయించి మున్సిపల్ అధికారులు వాటితో సేవలు పునరుద్దరించే పనులు చేపట్టారు. ఏజన్సీతో సంబంధం లేకుండా కేవలం క్లాప్ డ్రైవర్లకు జీతాలు నేరుగా చెల్లించేందుకు, డీజల్ ఖర్చులు భరించేందుకు కౌన్సిల్ తీర్మానం తీసుకున్నారు.

వీధుల్లో చెత్త దిబ్బల కంపు

పట్టణంలో మళ్లీ చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త తరలింపులో జాప్యం జరుగుతుండడంతో కుళ్లి కంపుకొడుతున్నాయి. కేవలం 18 క్లాప్ ఆటోలు మాత్రమే తిరుగుతున్నాయి. చాలా వార్డుల్లో పుష్‌కాట్‌తో సేకరించిన చెత్త నేరుగా డంపింగ్ యార్డుకు వెళ్లకుండా రోడ్లపై చెత్త పాయింట్లవద్ద సిబ్బంది వేస్తున్నారు. ఈ చెత్త దిబ్బలు సకాలంలో తరలించడంలో జాప్యం జరుగుతుండడంతో వాటిని పందులు అపరిశుభ్రం చేస్తున్నాయి.

18 క్లాప్ వాహనాలు, 10 ట్రాక్టర్లు, మూడు పెద్ద కంపాక్టర్లు, మూడుచిన్న కంపాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే పనుల్లో శానిటేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం తలెత్తింది. దీంతో పట్టణంలో పారిశుధ్య సేవల్లో విఫలం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని మున్సిపల్ ఉన్నతాధికారులు సైతం అంగీకరిస్తున్నారు.


వినియోగంలో సగం పుష్‌కాట్‌లు

మున్సిపాలిటీలో 41 వార్డులు వుంటే క్లాప్ వాహనాలు అందులో సగం వార్డులకు కూడా సేవలు అందడం లేదు. దీనికి తోడు కమర్షియల్ వ్యర్థాల సేకరణకు ప్రత్యేకించి వాహనాలు లేవు. ఇందువల్ల చాలా వార్డులో ఇంటింటి చెత్త సేకరణకు పుష్‌కాట్‌లు తీసుకెళ్లి సేకరించాలన్నా పుష్‌కాట్‌లలో 180 వుంటే అందులో కేవలం 90 మాత్రమే పనిచేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీంతో చాలా వార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు.



నిలిచిపోయిన క్లాప్ వాహనాలు - మడూరు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

పారిశుధ్య సేవలు మెరుగు పరుస్తాం



ప్రొద్దుటూరులో పారిశుద్య సేవల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవం. గతంలో ఒక ఏడాది పైగా క్లాప్ ఆటోలతో నేరుగా ఇంటింటి నుంచి సేకరించిన చెత్త డంపింగ్ యార్డుకు వెళ్లేది. క్లాప్ ఆటోలు నడపడంలో ఏజన్సీ చేతులెత్తేసింది. ఏజన్సీతో సంబంధం లేకుండా మున్సిపాలిటీనే నేరుగా క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు చెల్లించేలా కౌన్సిల్ తీర్మానం తీసుకున్నాం. డీజల్ ఖర్చులు మున్సిపాలిటీనే భరిస్తోంది. అందువల్ల 18 ఆటోలను తిప్పుతున్నాం. ఇవి సగం వార్డులకే సేవలు అందించగలవు. కంపాక్టర్లు ట్రాక్టర్ల ద్వారా చెత్తపాయింట్ల వద్ద నుంచి సకాలంలో తరలింపు జరగడం లేదు. శానిటేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం, వర్కర్లపై నియంత్రణ లేదు. వారం పది రోజుల్లో పారిశుధ్య సేవలు పూర్తి స్థాయిలో మెరుగు పరుస్తాం.

రఘునాథరెడ్డి మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

132 వాహనాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 14: ప్రొద్దుటూరులోని అమృతానగర్‌లో ఉదయం నిర్వహించిన పోలీస్ తనిఖీల్లో 132 వాహనాలు సీజ్ చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. డీఎస్పీ నేతృత్వంలో సీఐలు యుగంధర్, శ్రీకాంత్, వెంకటరమణ, అబ్దుల్ కబీర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ రికార్డులు లేని 132 వాహనాలను సీజ్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బైక్, ఆటో, ఇతర వాహనాలను తప్పనిసరిగా రికార్డులు ఉండాలని లేదుంటే ఆ వాహనాలను సీజ్ చేస్తామని ఆయన చెప్పారు.

దాడి చేసిన కేసులో వ్యక్తి అరెస్టు

కడప(క్రైం), ఏప్రిల్ 14: కడప నగరం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె వాసి వంశీపై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాలూకా పోలీసులు ఆదివారం తెలిపారు. ఆలంఖాన్‌పల్లెలోని రాణితోట వీధికి చెందిన వంశీ, అదే ప్రాంతానికి చెందిన యువతిని కొన్నేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సహా అక్కడే ఉండేవాడు. కాగా కొద్దిరోజుల కిందట సొంతూరికి వచ్చాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటివద్ద ఒంటరిగా ఉన్న వంశీపై అదే గ్రామస్తుడు వెంకటేష్ అలియాస్ వంశీ, తిరుపతి సురేంద్ర అలియాస్ జాకీ బీరుబాటిల్‌తో దాడి చేశారు. వీరికి గతంలోనే మనస్పర్థలుండేవి. వంశీ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌టీపీపీ క్యాంటిన్ టెండర్లు ఉపసంహరించుకోవాలని పరోక్ష బెదిరింపులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 14: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు క్యాంటిన్ ప్రాజెక్టు హాస్టల్‌కు 2024 - 2025కు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు దాఖలుకు ఏప్రిల్ 15న ఆఖరి తేది నిర్ణయించారు. ఇప్పటికే ఈ టెండర్ల కోసం 8 మంది సివిల్ కాంట్రాక్టర్లు షెడ్యూల్ ఫారాలు తీసుకున్నారు. షెడ్యూలు ఫారం రూ.800, డీడీ రూ.30,000 వేలు చెల్లించి పాల్గొననున్నారు. అయితే ఇదివరకే నిర్వహిస్తున్న వ్యక్తికే క్యాంటిన్ టెండరు దక్కేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు హాస్టల్ నిర్వహణలో టీ, కాఫీ, టిఫెన్, భోజనం అందుబాటులో వుంటుంది. వీటికి ప్రాజెక్టు అధికారులు నిర్ణయించిన ధరలకంటే తక్కువ కోట్ చేసిన వారికే ఈ టెండరు దక్కుతుంది. కానీ ప్రాజెక్టు హాస్టల్ టెండర్లలో పాల్గొనే వారిని ఉపసంహరించుకోవాలని కొందరు బెదిరిస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. వారు ఉన్నత స్థాయిలోవున్న వ్యక్తులు కావడం చేత కొందరు ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు సమాచారం. పాత వ్యక్తులకే ఇవ్వడానికి టెండర్లు ఎందుకు విడుదల చేయాలని టెండర్ షెడ్యూలు ఫారాలు కొని డీడీలు చెల్లించాక ఇలా ఒత్తిళ్ళు పెంచటం సరికాదని వాదిస్తున్నారు. ఇందులో కొందరు అధికారులకు మాముళ్ళు అందుతున్నందువల్ల వారు తమకు అనుకూలంగా వుండే వ్యక్తులకు టెండరు దక్కేలా పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఈ(సివిల్) శ్రీధర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరడానికి ఆయనకు ఫోన్‌చేస్తే ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

బాలికను ఇబ్బంది పెడుతున్న వ్యక్తిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 14: ప్రేమ పేరుతో బాలికను ఇబ్బంది పెడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని బాలికపై ఎస్టీ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవరు మస్తాన్‌వలి ప్రేమ పేరుతో ఇబ్బంది పెడుతూ చెడుగా ప్రచారం చేస్తున్నారని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఇది ఇలా ఉండగా పోలీసులు స్టేషన్‌కు పిలిపించి తనను అవమానకరంగా మాట్లాడారని మస్తాన్‌వలి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు అతనికి చికిత్స అందించారు. సంఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఆటో బోల్తా - ఒక్కరికి గాయాలు

నందలూరు, ఏప్రిల్14: చెయ్యేరు వంతెనపై ఆదివారం అదుపు తప్పి ఆటో బోల్తాపడడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమి కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా పడడంతో వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది.

సామాజిక మార్పునకు అర్థం అంబేడ్కర్

అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయం, కడప వైవీయూ, ఆర్కిటెక్చర్ వర్సిటీల్లో అంబేడ్కర్ జయంతి



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్నఅన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు - వైవీయూనివర్సిటీలో రిజిస్ట్రార్ తదితరులు

రాయచోటిటౌన్, ఏప్రిల్14: బహుముఖ వ్యక్తిత్వం కలిగిన న్యాయ నిపుణుడు, విద్యావేత్త, ఆర్థిక వేత్త, సామాజిక సంస్కర్తగా దేశానికి, సమాజానికి విశేషమైన కృషి చేసిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సామాజిక మార్పునకు మార్గదర్శకుడని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకట సుబ్బయ్య వేర్వేరు కార్యక్రమాల్లో కొనియాడారు.

అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో భారతరత్న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలు పోగొట్టిన మహోన్నతమైన వ్యక్తిగా అంబేడ్కర్‌ను అభివర్ణించారు. కార్యక్రమంలో ఎస్పీ, అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అడ్మిన్ శ్రీనివాసులు, హోంగార్డ్స్ ఆర్ఐ చలపతి, ఆర్ఐ ఎంటీఓ పెద్దయ్య, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైవీ యూనివర్సిటీలో..

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 14: వైవీయూలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్‌ఏయూలో : భారతరాజ్యాంగానికి రూపకల్పన చేసిన అంబేడ్కర్ దేశానికే గర్వకారణమని, ప్రముఖ న్యాయవాదిగా చిరస్మరణీయుడని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటరు మనోహర్‌రావు, పాల్గొన్నారు.

ఆర్‌జేడీ ఆధ్వర్యంలో : కడప నగరం కలెక్టరేట్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు తుపాకుల మురళి, ఎ.రామచంద్ర, ఎం.వెంకటసుబ్బయ్య, క్రిష్టఫర్‌జాన్, రాజగోపాల్‌రెడ్డి, పలువురు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వానికి అంకితమైన గొప్ప వ్యక్తిడాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నేతలు ఇల్లూరు ఓబులేసు, ఎస్టీ సెల్ భాస్కర్, రాజశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ముద్దనూరు రాయుడు, బీసీ సెల్ నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, జీవన్, అనిల్, బిల్లా నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి

రక్తదాన శిబిరం : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా వివిధ స్వచ్ఛంధ సేవకులు విజయకుమార్, నాగభూషణం, ఏపీ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ధనుంజయ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

'ఎలక్షన్ మిత్ర'ను సద్వినియోగం చేసుకోండి : ఎస్పీ

కడప(క్రైం), ఏప్రిల్ 14: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిరంతరం నిఘా ఉంచామని, ఇందులో భాగంగా నాకాబందీ, పల్లెనిద్ర నిర్వహిస్తున్నామని ఎస్పీ సిద్దార్థ కౌశల్ వెల్లడించారు. పోలీసు పెన్నా కాన్ఫరెన్సు హాలులో ఆదివారం అదనపు ఎస్పీ లోసారి సుధాకర్‌తో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ మిత్ర వెబ్‌సైట్‌ను ఎన్నికల సమయంలో సద్వినియోగపడేలా రూపొందించామన్నారు. భవిష్యత్తులో పోలీసు అధికారులకు కేసుల పరిష్కారంలో కూడా ఉపయోగ పడుతుందన్నారు. డీజీపీ రాజేంద్రనాథరెడ్డి, ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మార్గదర్శకంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎలక్షన్ మిత్ర.ఇన్ వెబ్‌సైట్‌ను ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా రూపొందించామన్నారు. ఈ వెబ్‌సైట్ ఎన్నికలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని పొందుపరిచామన్నారు. ఎన్నికల మాన్యువల్, హ్యాండ్‌బుక్, ప్రెస్‌నోట్లు, నోటిఫికేషన్లు మొదలైన వాటిని పొందుపరిచినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ ఈ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జరిపిన తనిఖీల్లో దాడుల వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో 43 నాటుసారా కేసులు నమోదు చేశాని 83 మందిని అరెస్టు చేసి 14,033 లీటర్ల నాటుసారాను సీజ్ చేశామన్నారు. నాటుసారా తయారీ కేంద్రంలో బెల్లంఊటను ధ్వంసం చేసి 341 కేసులు నమోదు చేశాని ఒకరిని అరెస్టు చేశామన్నారు. మద్యం కేసుకు సంబంధించి ఎన్డీపీఎల్ 174 కేసులు నమోదు చేయగా 208 మంది అరెస్టు చేశామని, వీరి నుంచి 3,24,974 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. మద్యం విలువ రూ.26,04,414 ఉంటుందన్నారు. మ ద్యం కేసులో బీపీఎల్ కేటగిరీలో 2563 కేసులు నమో దు చేసి, 2526 మందిని అరెస్టు చేశామని, వీరి ద్వారా 14,01,043 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. దీని విలువ రూ.77,23,962 ఉంటుందన్నారు. జిల్లాలో నాలుగు గంజాయి కేసులు నమోదు కాగా, 11 మందిని అరెస్టు చేశామని, రూ.5.50 లక్షలు విలువైన 105 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో అక్రమంగా నగదు, బంగారు, వెండి తరలిస్తున్న వారిపై 255 కేసులు నమోదు చేసి రూ.1,24,93,282 నగదు, 17,904 కిలోల బంగారు, 41.925 కిలోల వెండి ఆభరణాలు సీజ్ చేశామన్నారు. గ్యాంబ్లింగ్, మట్కా, ద్వారా రూ.52,69,905 నగదు సీజ్ చేశామని, జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లైసెన్సుడు ఆయుధాలు 725 ఉన్నాయని, వీటితో పాటు భద్రతకు ఉపయోగిస్తున్న వాటితో కలిసి 774 ఉన్నాయన్నారు. 670 ఆయుధాలను డిపాజిట్ చేశారని, ఇంకా బ్యాంకులు, ఇతర సంస్థల వద్ద 96 ఆయుధాలు ఉన్నాయన్నారు. నేరాలకు పాల్పడే వారిని బైండోవర్ చేశామని, 110 సీఆర్‌పీ కింద 967 కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు.

వైసీపీ పాలనలో విద్యారంగం సర్వనాశనం

- టీడీపీ అధికారంలోకి రాగానే ప్రైవేటు విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి
- కేజీ టు పీజీ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ విద్యా సదస్సులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



విద్యా సదస్సులో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 14: వైసీపీ పాలనలో విద్యారంగం సర్వనాశనమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ప్రైవేటు విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేందుకు అనువుగా కంకణం కట్టుకుని మరీ ఐదు సంవత్సరాలుగా పాలన సాగించడం దారుణమన్నారు. జగన్ హయాంలో ప్రైవేటు విద్యావ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ కల్యాణ మండపం (సుశాంత్ మోటల్స్)లో కేజీ టు పీజీ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ విద్యాసదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ ఏపీలో రాజ్యాంగం అటకెక్కించి జగన్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ప్రైవేటు విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోవడం బాధాకరమన్నారు. ఇవాళ సామాన్యులకే రాష్ట్రంలో రక్షణ లేకుండాపోయిందనే సంగతి యావత్ రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. ఆ మేరకు పెన్షన్ రాలేదని ఓ వృద్ధుడు నిరసన చేస్తే అతనిపై కేసు పెట్టి లోపల వేసిన చరిత్ర వైసీపీ పాలనలో ఉందన్నారు. ముఖ్యంగా ప్రభు త్వం అందించే విద్యార్థులు ట్యూషన్‌ఫీజులు, రీయింబర్స్‌మెంటు కాలేజీ ప్రిన్సిపాల్ బ్యాంకు అకౌంటులో జమ చేయకుండా అమ్మఒడి పేరుతో తల్లుల ఖా తాల్లో జమ చేయడం వల్ల ఆ డబ్బును వారు ఇతరత్రా వాటికి వాడుకుని సకాలంలో యాజమాన్యానికి చెల్లించలేకపోతున్నారని అన్నారు. ఫీజు కట్టలేదనే నెపంతో ఆ విద్యార్థులను ఆయా ప్రైవేటు స్కూళ్ల యాజ మాన్యం పరీక్షలు రాయనివ్వకుండా చేస్తున్నారని దీనికంతటికీ కారణం వైసీపీ అసమర్థపాలనకు నిదర్శనమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రైవేటు విద్యాసంస్థలె తీవ్ర సంక్షోభంలో పడినప్పటికీ సంబంధిత యాజమాన్యం సకాలంలో స్పందించకపోవడం వల్లనే సమస్యలు మరింత జఠిలం అయ్యాయన్నారు. అలా కాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాట పట్టి ఉన్నట్లయితే సమస్య త్వరితగతిన సఫలీకృతం అయ్యేదన్నారు. చంద్రబాబునాయుడు విద్యారంగానికి పెద్దపీట వేసిన సంగతి తెలిసిందేనన్నారు. వ్యక్తిగత స్వార్థంతో పాలన సాగించే జగన్‌రెడ్డిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గద్దె దించేందుకు ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీ, జనసేన పార్టీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని, దీన్ని వైసీపీ భూతద్దంలో చూపుతూ ప్రజల ఓట్లు కోసం సరికొత్త డ్రామాలకు తెర లేపుతున్నారన్నారు. కేవలం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలును దృష్టిలో పెట్టుకుని తమ అధినేత చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు తప్ప వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకోసం కాదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గత ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఓట్లను దండుకోవాలనే కోడికత్తి డ్రామాను తెరపైకి తెచ్చి కొత్తనాటకానికి తెర లేపగా, ప్రస్తుతం మరోసారి ఎన్నికల స్టంట్‌లో భాగంగా బస్సుయా త్ర చేస్తూ విసిరిన రాయిదెబ్బ డ్రామా వేశారన్నారు. జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు విశ్వసించేలా లేరని జగన్ తెలుసుకోవాలన్నారు. ఏపీ రాష్ట్ర ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ కన్వీనరు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలను ఆదుకుంటాడనే ఆశతో గత 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు మద్దతు ఇచ్చి గెలిపించాయన్నారు. అయితే ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. పైపెచ్చు ప్రైవేటు విద్యాసంస్థలను చిన్నభిన్నం చేసే కుట్రలో భాగంగా పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు లేకుండా చేశారన్నారు. ఎంతో కష్టపడి ప్రైవేటు విద్యాసంస్థల్లో డీఎడ్ కాలేజీలు తెచ్చుకుంటే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అవన్నీ మూసివేయడం దారుణమని తక్షణమే వాటిని తెరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో జగన్‌రెడ్డి మాటలువిని మోసపోయిన కరస్పాండెంట్లంతా మరోసారి మోసపోకుండా రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా జగన్‌రెడ్డిని ఓడించేందుకు కంకణం కట్టుకుంటామన్నారు. అనంతరం టీడీపీ కడప అసెంబ్లీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి మాట్లాడుతూ గెలుపే ధ్యేయంగా ఎన్నికల ప్రచారం చేస్తూ ఏడు నెలలు పాటు నగరంలోని సుమారు 70వేలకు పైగా ఇళ్లు తిరిగి ప్రజలతో మమేకమైనట్లు వివరించారు. అన్ని వీధుల్లో ప్రజలు ఘన స్వాగతం పలికి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారన్నారు. గత పది సంవత్సరాల కాలం పాటు నగర కార్పొరేషన్ వైసీపీ ఆధీనంలో ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఓటు అనే ఆయుధంతో కడపలో సరికొత్త విప్లవానికి నాంది పలికి తనను గెలిపించాలని కోరారు. కడప పార్లమెంటు అభ్యర్థి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలను జగన్‌రెడ్డి ఉక్కుపాదంతో అణగదొక్కడం దారుణమన్నారు. అమ్మఒడి పేరుతో రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలు, 13వేలతోనే సరిపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీని గెలిపించాలన్నారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య యజమానులు మోహన్‌రావు, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, జిల్లా పలువురు ప్రైవేటు పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... కేజీ టు పీజీ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ విద్యాసదస్సుకు హాజరైన ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుదాం

- కష్టాల్లో అన్ని వర్గాల ప్రజలు
- అందరం ఏకమై అంతమొందిద్దాం
- టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి


కడప నగరం 7వ డివిజనులో టీడీపీలో చేరిన యువత

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 14 : రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీపాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం కడప నగరం 55వ డివిజన్‌లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ప్రతిఒక్కరూ సైకిలు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హర్ష, అనిల్, ఉదయ్, మాసాపేట శివ, జిలానీబాషా, తిరుమలేశ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భారీగా చేరికలు...

కడప నగరం 12వ డివిజన్ భరత్‌నగర్‌లో ఎస్వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో భారీగా చేరికలు జరిగాయి. చేరిన వారికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. శివకొండారెడ్డి, బొమ్మిశెట్టి చంద్రపాలెంపపల్లె సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, జిలానీబాషా, మల్లి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సాయిపేటలో...

కడప నగరం సాయిపేటలో మాజీ కార్పొరేటరు సుగవాసి పవన్‌కుమార్, సుగవాసి పృథ్వీరాజ్, సుగవాసి యువరాజ్, వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారిని పార్టీ కండువా వేసి టీడీపీలోకి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

7వ డివిజనులో...

కడప నగరం 7వ డివిజన్‌లో యువత టీడీపీ పార్టీలోకి చేరింది. వారికి టీడీపీ జిలల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పార్టీకండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రనమంలో పెనగలూరు శ్రీనివాసులు, తుంగా రమణయ్య పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 14 : అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు కొనియాడారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

పులివెందులలో... పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటేశులు, జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్, ఏపీఎస్ఆర్టీసీ గ్యారేజీలో కార్మికులు, పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

వేంపల్లెలో... పీసీసీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, దళిత నాయకులు ఈశ్వరయ్య, యుగంధర్, వెంకటయ్య, వెంకటయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

సీమాంధ్ర ధళితసేన ఆధ్వర్యంలో....సీమాంధ్ర దళిత ప్రజా సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దపల్లి ఓబుల పతి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

చెన్నూరులో...

చెన్నూరు, రామనపల్లెలో ఎంపీపీ చీర్ల సరేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జీఎస్‌బాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

టీడీపీలో 100 కుటుంబాలు చేరిక

- చంద్రబాబు సీఎం కావడం తథ్యం
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, ఏప్రిల్ 14: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షు డు నారా చంద్రబాబునాయుడితోనే సంక్షేమం, అభివృద్ధి ఆధారపడి ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నుండి వంద కుటుంబాలవారు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, సాయినరసింహారెడ్డి, టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, ఏటూరు రామచంద్రారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారితో పుత్తా నరసింహారెడ్డి తదితరులు

చిన్నకుడాలలో ఎనిమిది కుటుంబాలు చేరిక


పార్టీలో చేరిన చిన్నకుడాల నాయకులతో బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 14: వైసీపీకి కంచుకోటలా చెప్పుకొనే లింగాల మండలంలో టీడీపీ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆదివారం మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలవారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో లింగాల టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, గంగిరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న వారికి బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 14: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం నందిమండలం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు మయూర్‌రెడ్డి, జయరాం, ఆంజనేయులు, అమర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంతోనే ప్రజలకు మేలు

వేంపల్లె, ఏప్రిల్ 14: టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి తెలిపారు. నందిపల్లెలో టీడీపీ కూటమి ప్రచారం నిర్వహించారు.

శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 14 : కడప నగరం శ్రీహరి డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు ఆదివారం గ్రాడ్యుయేషన్ డే ఫేర్‌వేల్ కార్యక్రమాన్ని ఘ నంగా నిర్వహించారు. బీబీఏ డిపార్టమెంటు ఆధ్వర్యంలో బీబీఏ విద్యార్థులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధిపతి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కళాశాలలో నేర్చుకున్నజ్ఞానా న్ని ఇంప్రూవ్ చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పిలుపునిచ్చారు. బీబీఏ ఫైనల్ విద్యార్థులకు సర్టిఫికెట్ మెడల్స్ ఇచ్చి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు సమాజానికి ఉపయోగపడాలి


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సీకేదిన్నె, ఏప్రిల్ 14: విద్యార్థులు సమాజానికి ఉపయోగపడాలని వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్ తెలిపారు. బయనపల్లె వెంకటేశ్వర ఉన్నతపాఠశాల 10వ తరగతి 2000-2001 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమ ని ర్వాహకులుగా విద్యార్థులు నరసింహయ్య, రాజా, గురుప్రసాద్‌రెడ్డి, శివయ్య, నాగరాజేంద్రప్రసాద్, పరమేష్, వెంకటాచలపతి అభినందించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు


జమ్మలమడుగు, ఏప్రిల్ 14: జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండులో ఆదివారం ఉదయం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నయ్య, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంతోష్, జయచంద్ర, బిర్రు పిలిప్, నల్లప్ప, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జంగాల మునిస్వామి, మేకల అంజనేయులు, రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచాల పుష్పరాజు తదితరులు ఘన నివాళి అర్పించారు. అలాగే డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, దళిత ప్రజాసంఘాల నాయకులు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచికెబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కె.సాల్మన్, ఉపాధ్యక్షుడు నరసింహులు, జీజే సైమన్, ప్రతాప్, దస్తగిరి తదితర నాయకులు పాల్గొన్నారు. బడిగించల చంద్రమౌళి, విజయలక్ష్మి, ఛైర్‌పర్సన్ శివమ్మ, ఉప్పలపాడు యోబు, తదితరులు నివాళులర్పించారు.

బద్వేలు..: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని టీడీపీ యువనేత కే.రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించు కుని ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్ రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.కాగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఘన నివాళులర్పించారు. ఏపీ రైతు సంఘం మాజీరాష్ట్ర కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో రాధాక్రిష్ణ కళ్యాణమండపంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. మహాత్ముల జయంతి ఉత్సవ నిర్వహణకమిటి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కమిటి ఛైర్మన్ రత్నం, పూలే ఆశయ సాధన సమితి ఛైర్మన్ బద్వేలు గురుమూర్తి, సంఘమిత్ర సొసైటీ అధ్యక్షుడు సొద్దల పెంచలయ్య పాల్గొన్నారు. లోకానమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరుమామిళ్ల..: అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గిరినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాలుర్పించారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.కాగా పోరుమామిళ్లపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ యనమలసుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎస్టీయు ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి రమణారెడ్డి, క్రిష్ణారెడ్డి, కుళ్లాయప్ప, ఎస్టీయు నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అలాగే ఏపీటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగు మస్తాన్, చెన్నయ్య పాల్గొన్నారు. ఏపీ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య, జిల్లాకార్యదర్శి బాల రంగయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: మండల కేంద్రంలోని బీఆర్అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్, గుడిమెగురవయ్య ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సునీల్‌నగిలి రవి, నారాయణ, జ్ఞానేశ్వర్, విలియం, ప్రభాకర్, హృదయనాద్, జగన్, జగదీష్ పాల్గొన్నారు.





జమ్మలమడుగులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భూపేశ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ప్రొద్దుటూరులో నివాళులర్పిస్తున్న వరదరాజులరెడ్డి

మైదుకూరు..: అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహం వద్దకు ఎమ్మార్పీయస్, అనుబంధ సంఘాల నాయకులు చేరుకొని నివాళులర్పించారు. అలాగే ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మిద్దె వెంకట రమణ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం చేపట్టారు. అలాగే ఎస్టీయూ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు యూత్ జిల్లా అధ్యక్షుడు తీట్ల చిట్టిబాబు, నాయకులు వెంకట రమణ, మాధవయ్య, వినోద్, సుమంత్, తప్పెట శివ, హరిబాబు, వెంకట సుబ్బయ్య, గురవయ్య పాల్గొన్నారు.

కొండాపురం..: అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.కొండాపురం వెలుగు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బి.రమేష్ , కొండాపురం ఎస్టీ కాలనీలో ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు డేరా జ్యోతి,తాళ్లప్రొద్దుటూరు ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ (మందకృష్ణ) జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీరాముడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఓంకార్, నాగసుబ్బరాయుడు,రామకృష్ణ, కుళ్లాయప్ప,నాగన్న,పెద్దన్న పాల్నొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడి చంద్రబాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం నాయకులు శేఖర్, ఓబులేసు, గౌస్‌బాష, శ్రీనివాసులు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

- సీపీఎం పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ,ముంతాజ్‌బేగం, వెంకటసుబ్బమ్మ,సర్వేశ్వరి, రాములమ్మ, శేఖర్‌బాబు పాల్గొన్నారు.
- ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.ఓబులేసు, న్యాయవాదులు కొండారెడ్డి, బాలాజీ, సుమంత్‌కుమార్ పాల్గొన్నారు.
- జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి కన్వీనర్ నాగరాజు, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ కన్వీనర్ కవిత, జేవీవీ నాయకులు సునీత, రవి, వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఖాజీపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.లక్ష్మీదేవి, మాలమహానాడు నాయకులు పీడబ్ల్యూడీ బంగ్లాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజయ్, ఎస్సీ మండల అధ్యక్షులు ఉదయ్, కిసాన్‌మోర్చ మండలాధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శులు కొండయ్య, శివరామ్, టీడీపీ నాయకులు పుల్లయ్యనాయుడు, పుల్లూరు నారాయణ, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబన్న, అకాడమిక్ కమిటీ మెంబర్లు మీసాల మునెయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా పోలీసు స్టేషన్‌లో సీఐ రామాంజులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహాసేన జిల్లా అధ్యక్షుడు ఓబులేసు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: సామాజిక మార్పుకోసం అంబేడ్కర్ సాగించిన మహత్తర పోరాటం మరువలేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మైదుకూరురోడ్డులోని ఆయన విగ్రహానికి వరదరాజులరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, తలారి రమేష్, భారత్ గౌస్, ఖలీల్ దాదాపీర్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ కలలు గన్న బహుజన సమాజం కోసం పాటు పడతామని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల వెంకటన్న పేర్కొన్నారు. ఆదింవారం మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మైదుకూరు రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సాత్రి లక్షమయ్య నివాళులర్పించారు. అంబేడ్కర్ అందరివాడని ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివక్రిష్ణ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాడికి రమేష్ ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కేఎన్ రాజులు పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

ముద్దనూరు..: మండల పరిధి కోడిగాండ్లపల్లె సమీపంలోని మానసిక వికలాంగుల(ఏసుకరుణాలయం)ఆశ్రమంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. సీపీఐ కొండాపురం మండలం కార్యదర్శి మనోహర్ బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి ,నివాళులు అర్పించారు. అనంతరం ఆశ్రమానికి నిత్యవసరాలు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో నాగన్న, ఖాదర్‌బాషా, అశ్విన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి ,ఉపాధ్యాయులు రామయ్య, రామాంజనేయులు, గంగార్జున,షేక్షావలి పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: అంబేడ్కర్ ఆశయ సాధనకు నిరంతరం పోరాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక రాధాక్రిష్ణ కళ్యాణ మండపంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడురాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు చంద్రాయుడు, వీరశేఖర్,మునెయ్య, సుధాకర్, ఓఎస్సీ ప్రసాద్, వెంకటరమణ, పెంచలయ్య, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

బద్వేలు టౌన్, ఏప్రిల్ 14 : పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వారోత్సవాలను మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు శేఖర్‌రావు, సబ్‌జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కామేశ్వర్‌రావు, అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జ్ వెంకటసుబ్బయ్య వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుధాకర్, హరిక్రిష్ణ, ప్రసాద్, గురయ్య, పుల్లయ్య, రాజు, ప్రతాపరెడ్డి, రాజశేఖర్, శేషయ్యపీరయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబు, జైల్ సూపరింటెండెంట్ సురేష్, సహాయ జిల్లామాపక అధికారి రఘునాథ హాజరయ్యారు. వారం రోజుల పాటు రోజూ ఒక ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్గిస్తామన్నారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు శిరీష పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

మైదుకూరు..: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం మున్సిపల్ కమిషనరు జబ్బార్‌మియా, అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఆదివారం నుంచి 20 వరకు మైదుకూరు నియోజకవర్గంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి వెంకట రమణ పేర్కొన్నారు. కాగా అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అగ్నిమాపక వారోత్సవాలపై కరపత్రాలు విడుదల చేశారు.

కొండయ్యస్వామి ఆశీస్సులు తీసుకున్న పుట్టా

మైదుకూరు, ఏప్రిల్ 14 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం అవధూత కొండయ్య స్వామి ఆశీస్సులు పొందారు. నాయకులతో కలసి స్వామి వారి ఆశ్రమానికి చేరుకుని ఆయనకు కొండయ్య స్వామి శాలువ కప్పి సత్కరించారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, నాయకులు ధనపాల జగన్, ఆర్ శ్రీనివాసులు, రవీంద్ర, రాకెట్ రఫీ పాల్గొన్నారు.

150కుటుంబాలు జనసేనలో చేరిక

బద్వేలు, ఏప్రిల్ 14:పట్టణంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో 150కుటుంబాలు జనసేన పార్టీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాసులు, రమేష్ ఆధ్వర్యంలో చేరాయి. ఈ మేరకు ఉమ్మడి అభ్యర్థి రోశన్నను గెలిపించాలని వారు కోరారు. ఈ మేరకు పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బలిజసేవాసంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సురేంద్ర, నాగార్జున, సుబ్బారావు,శ్రీనివాసులు,మురళి,నరసింహ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైస్ సర్పంచ్

మైదుకూరు రూరల్ ఏప్రిల్14 : ప్రొద్దుటూరులోని టీడీపీ కార్యాలయం లో ఆదివారం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో చెర్లోపల్లె గ్రామానికి చెందిన వైస్ సర్పంచ్ సురేష్‌యాదవ్ తో పాటు రఘురాం,సవాలా పెద్ద సుబ్బయ్య, నరసింహులు,ఓబయ్య వారి అనుచరవర్గం తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలోకి చేరిక

దువ్వూరు (మైదుకూరు), ఏప్రిల్ 14 : దువ్వూరు మండలం గుడిపాడుకు చెందిన వైసీపీ నాయకులు, 1 వ వార్డు సభ్యుడు బందేఖాన్‌తో పాటు అనుచరులు ముల్ల గఫార్, సాబిర్ ఖాన్, షరీఫ్, మాబుసాబ్ తదితరుల 30 కుటుంబాల వారు ఆదివారం ప్రొద్దుటూరు లోని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ కార్యాలయంలో పార్టీలో చేరారు. నాయకులు రాంబాబు, తాహీర్, నాగరాజు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

18న ఉరుసు మహోత్సవం

మైలవరం, ఏప్రిల్ 14: మైలవరం జలాశయ పడమటి వైపు కొండల్లో వెలసిన హజరత్ సయ్యద్‌షా పీర్ గైబుషావలి ఉరుసు మహోత్సవం ఈ నెల 18వ తేదీ గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉరుసు మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా 17వ తేదీన గంధం, 18న ఉరుసు మహోత్సవం, రాత్రికి గొప్ప ఖవ్వాలి కార్యక్రమాలు ఉంటాయని, జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి మైలవరం మీదుగా ఉరుసు మహోత్సవానికి కొండపైకి స్పెషల్ బస్సులు నడుపుటకు డిపో మేనేజర్ ఏర్పాటు చేశారని కమిటీ సభ్యులు తెలిపారు.

తండ్రి గెలుపు కోసం తనయుడు ప్రచారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 14 : బద్వేలు నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం ఆయన తనయుడు రోషన్ కార్తీక్ ఇంటింటి ప్రచారం చేశారు. ఆదివారం ఆయన పోరుమామిళ్ల మండలం లోనిగానుగపెంట పంచాయతీ,కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇంటింట ప్రచారం

బి.కోడూరు, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో ఆదివారం ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నను గెలిపించాలంటూ మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, గోడి రమణారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల వెంకట సుబ్బయ్య, జయరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్, నవీన్, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీవి నీచ రాజకీయాలు

ఓటమి భయంతో సానుభూతికోసం కొత్త డ్రామాలు : కొండారెడ్డి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 14 : వైసీపీవి నీచ రాజకీయాలని ఓటమి భయంతో మళ్ళీ జనంలో సానుభూతికోసం సరికొత్త గులకరాయి దాడి ఘటనను తెరమీదకు తెచ్చారని టీడీపీ నాయకుడు నంద్యాల కొండా రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌పై గులకరాయితో జరిగిన దాడి నిజమైతే దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు దౌర్జన్యాలకు తావులేదన్నారు. ఎలాంటి రాజకీయ విమర్శలనైనా రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప ఇలాంటి పిరికిపంద చర్యలు ఎవ్వరూ చేయరాదన్నారు. కానీ జగన్‌పై నిజంగా దాడి జరిగిందా అయితే భద్రతా వైఫల్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ముఖ్యమంత్రి పర్యటనలో విద్యుత్ అంతరాయం ఎందుకు జరిగిందనేది అనుమానంగా వుందన్నారు. రాత్రి వేళ ఈ ఘటన జరగటం వెనుక ఇది ఒక కోడి కత్తి డ్రామాలాగా సానుభూతి కోసం జరిగిందా అనే అనుమానాలున్నాయన్నారు. దాడిలో చిన్న గాయం మాత్రమే అయిం దని ఇలాంటి వాటికి చికిత్సపేర బస్సుయాత్ర నిలిపివేసి సానుభూతి రాజకీయం పండించాలని వైసీపీ వారు చూస్తున్నారన్నారన్నారు. ఈ దాడిని టీడీపీ మీదకు నెట్టి నీచ రాజకీయాలు పాల్పడ్డం సిగ్గుచేటన్నారు. ఇలాంటి కోడి కత్తి డ్రామాలు ఎన్ని చేసినా రాష్ట్ర ప్రజల్లో సానుభూతి పొందలేరన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బి.కోడూరు, ఏప్రిల్ 14 :మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కాసా వెంకటసుబ్బారెడ్డి, కుమారుడి వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట మండల నాయకులు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 14: అయిదేళ్ల వైసీపీ పాలనలో జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పీఎండీ నజీర్ విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని రకాల పనులు చేసి ప్రజలపై భారం వేశారని విమర్శించారు. మద్య నిషేధం అమలు చేస్తామని 25 సంవత్సరాలకు రుణాలు తెచ్చుకోవడం సిగ్గుచేటన్నారు. సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా జిల్లా ప్రజలు వైఎస్ కుటుంబాన్ని ఆదరిస్తున్నా జగన్ సొంత జిల్లాకు మోసం చేస్తున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆది,భూపేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

కొండాపురం, ఏప్రిల్ 14 : రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జీ దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు.మండలంలోని వెంకయ్య కాలువ,పాలూరు గ్రామాలలో ఆదివారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులునరసింహారెడ్డి, రమణారెడ్డి,గోరిశెట్టిబాబు,రామలింగేశ్వరరెడ్డి , నారాయణ, సురేష్,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి



మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

మైలవరం, ఏప్రిల్ 14: నియోజకవర్గం కూటమిలో భాగంగా బీజేపీకి కేటాయిం చారని, అందరూ కమలం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి దేవగుడి ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో పర్యటించిన ఆదినారాయణరెడ్డి గ్రామ సర్పంచ్ శైలజ, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ గ్రామ నాయకులతో ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థికి కమలం గుర్తుకు, కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు రామస్వామి, సుబ్బరామిరెడ్డి, రాజమునిరెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వరద ప్రచారం

రాజుపాలెం, ఏప్రిల్ 14: మండలంలోని వెలవలి, సోమాపురం, అర్కటవేముల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, జయవీర ప్రతాప్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, సోమాపురం సర్పంచ్ ప్రభావతి, ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, చల్లా రాజగోపాల్ పాల్గొన్నారు.

బీకోడూరు ఎస్ఐకి గాయాలు

బి.కోడూరు, ఏప్రిల్ 14: మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం కూటమి నాయకులు ఇంటింట ప్రచారం చేస్తున్నారు. కాగా అక్కడికి బందోబస్తుగా వచ్చిన ఎస్ఐ జయరాములు జీపునకు ముందు భాగాన నిలబడి ఉన్నారు. కాగా జీపునకు వెనుక భాగాన ట్రాక్టరు ఢీకొట్టడంతో జీపు ఎస్ఐ జయరాములుపైకి దూసుకెళ్లింది. దీంతో ఆయనకు ఎడమ చేయి, కుడి కాలు విరిగినట్లు బద్వేలు ప్రభుత్వ వైద్యులు తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

పార్టీలు వేరైనా అజెండా ఒకటే

వైసీపీ నుంచి 300 కుటుంబాలు జనసేనలోకి చేరిక

బద్వేలు టౌన్, ఏప్రిల్ 14 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాక్షస పాలన ఓడిపోవాలి,ప్రజా స్వామ్యం గెలవాలి అని అలాగే పార్టీలు వేరైనా అజెండా ఒకటేనని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, జనసేన జిల్లా కో-ఆర్డినేటరు సుంకర శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, బీజేపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు బొమ్మన సుబ్బరాయుడు, టీడీపీ నియోజకవర్గసమన్వయకర్త రితీశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కళ్యాణమండపంలో బలిజసంఘం నేతలు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, దగ్గం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నుంచి 300 కుటుంబాలు జనసేనలోకి చేరాయి. బద్వేలులో ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరపాటి సురేంద్ర, గద్దంనాగార్జున, సింగంశెట్టి సుధీర్, చిన్ని సుబ్బారావు, బాసిగాల్ల శ్రీనివాసులు, హనుమంతు బాల నరసింహులు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, కుప్పాల మురళి, తుంగా నరసింహ, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బసవి రమేష్, జనసేన సీనియర్ నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తిస్తా : పుట్టా



మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 14: ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బి.మఠంలో మాజీ మంత్రి డీఎల్.రవీంద్రారెడ్డి అనుచరుడు శ్రీనివాసులరెడ్డి నివాస గృహంలో పుట్టా సుధాకర్ యాదవ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమకు మద్దతు తెలిపాలని శ్రీనివాసులరెడ్డిని కోరారు. ఈ విషయంపై పాత్రికేయులతో శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే డీఎల్ ఆదేశాల మేరకు భారీ బహిరంగ ఏర్పాటు చేసి పార్టీలోకి వస్తామని ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ప్రముఖ న్యాయ వాది పట్టాభిరామ్, టీడీపీ నేతలు ముడుమాల పోలిరెడ్డి, సాంబశివారెడ్డి, జయరాంనా యుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు వెన్ను దన్నుగా వుండే పార్టీ టీడీపీ

జయహో బీసీ సభలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



మాట్లాడుతున్న బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 14 : రాష్ట్రంలో బీసీలకు వెన్ను దన్నుగా వుండే ఏకైక పార్టీ టీడీపీనే అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంనగర్ లోని భావన్నారాయణ స్వామి కళ్యాణ మండపంలో జయహో బీసీ సభ జరిగింది. ఈసందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ ఐదేళ్లకాలంలో బీసీలు వైసీపీ పాలనలో ఘోరంగా వంచించబడ్డారన్నారన్నారు.వైసీపీలో బీసీలు ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు, మంత్రులు అయినా ఎవ్వరికీ ఎలాంటి అధికారాలు వుండవన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు అన్ని విధాలా అధికారాలు వుంటాయన్నారు. అందుకే ప్రొద్దుటూరు లో టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, చల్లారాజగోపాల్‌యాదవ్, బొర్రా రామాంజనేయులు, సుంకరవేణు గోపాల్, మాజీ కౌన్సిలర్లు కొండయ్య, వద్ది బాలుడు, అమీర్‌బాషా, సోమా బాలయ్య, బాదుబోయిన సుబ్బారావు.బీసీ నాయకులు బోగా వీరయ్య, పల్లా శంకర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం



బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 14 : మైదుకూరు పట్టణం న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడుగా ఎంపికైన జి.బాలవెంకటయ్య యాదవ్‌ను ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ యాదవ సమాజ అన్నసత్రం పాలక మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం రానున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు భక్తులకు ఎటువంటి ఏర్పాట్లను చేపట్టాలని అలాగే అన్నదాన కార్యక్రమంపై ఏ విధంగా చేయాలన్నదానిపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్య యాదవ్, ప్రధానకార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్నయాదవ్ ,పెరుగు నారాయణయాదవ్, కటారు దేవరాయలయాదవ్, కొండపల్లె శేషగిరి, సంఘంసభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 14: స్థానిక శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం వేదపండితులు పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్ మిలాప్ నిర్వహించిన ఆవాజ్ నాయకులు

బద్వేలు, ఏప్రిల్ 14: ఆవాజ్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఈద్-మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హిందూ-ముస్లిం క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష, ఆవాజ్ జిల్లా కార్యదర్శి అన్వర్‌బాష మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన గొప్ప దేశమని కొనియాడారు. అయితే కొంతమంది స్వార్థ పరులు కులాలు, మతాలవారీగా ప్రజలకు ఘర్షణలు పెడుతున్నారని, ఇలాంటి వాటిని ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆటో యూనియన్ కార్యదర్శి రమణయ్య, ఆవాజ్ నాయకులు రసూల్, మహమ్మద్ ఆలీ, షరీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్ర, నాగేంద్ర, రామ్మోహన్, మహిళా సంఘం నాయకురాలు దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు